ఎయిర్‌పోర్ట్ నుంచి కారు బయల్దేరింది.

సత్యనారాయణ, మనోహరి ఎవరి ఆలోచనల్లో వారు ఉన్నారు. నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ ''మనూ...నేనిక్కడ దిగిపోతాను. కాసేపు క్లబ్‌లో కూర్చుని వస్తాను'' అన్నాడు సత్యనారాయణ.

ఆమె మౌనంగానే తలూపింది. తనవైపు తిరిగిన ఆ ఒక్క క్షణంలోనే మనోహరిలో పొంగిపొరలుతున్న దుఃఖాన్ని అదిమిపెడుతూ గాంభీర్యం ముసుగు వేసుకోగలిగాడతను. కాసేపు ఆమెని ఒంటరిగా వదిలిపెట్టడమే మంచిదనుకున్నాడు.

పోర్టికోలో కారుదిగి ఇంట్లోకి వెళ్లి తలుపేసుకుంది మనోహరి. తన గదిలోకి వెళ్ళబోతూ యధాలాపంగా హాలుని పరికించింది. సోఫాల్లో చిందరవందరగా పడి ఉండాల్సిన కుషన్స్ ఎక్కడివక్కడే నీట్‌గా ఉన్నాయేమిటి? టీవీ చూస్తున్నప్పుడు వాటిలో సగం విజయ ఒళ్ళోనే ఉండేవి. ఏ ఫోన్ మోగితే ఒక్క ఉదుటున లేచి కిందపడిన కుషన్ల మీదినించే గెంతి వెళ్లిపోయేది తన అరుపులను లక్ష్యపెట్టకుండా, ఇక అలా ఆ ఫోను సంభాషణ గంటల తరబడి సాగేది. అవునూ, తను వచ్చి పదినిముషాలైనా ఒక్కసారీ ఫోను మ్రోగలేదేమిటి? తన మనసులాగే అదీ మూగబోయిందా? తన పిచ్చికాకనీ ఎప్పుడైనా తను రిసీవర్ తీస్తే ''విజయ ఉందా ఆంటీ'' అన్న మాటలే కదా వినిపించేవి. సత్యానికైనా ఆఫీసు నుంచి ఒకటో, రెండో ఫోన్లు వచ్చేవి కానీ మిగిలినవన్నీ దానికే కదా. అన్యమనస్కంగానే ఒకసారి కుషన్లు సవరించి బెడ్‌రూంలోకి నడిచింది. తన టేబుల్ మీద కాగితాల దొంతర దొంతరలాగే నీట్‌గా ఉంది. గదినిండా న్యూస్‌పేపర్ విడి కాగితాలు ఎగరడంలేదు.

''అబ్బ, పో మమ్మీ పేపర్ అంతా నీట్‌గా మడుస్తూ కూర్చుంటే నాకు కాలేజికి టైమయిపోదూ! రాములమ్మని తీయమందూ'' అని తుర్రుమని బాత్‌రూంలోకి దూరిపోయేది. షెల్ఫ్‌లో పుస్తకాలూ నీట్‌గా ఉన్నాయి. ఇక్కడ ఈ బుక్స్ ఇలా పడిపోయాయేమిటి? మధ్యలోంచి కొన్ని లాగేసినట్లు, ఎవరికైనా ఇచ్చావా అని నిలదీస్తే దొరికిపోయిన ఫీలింగ్ ఒకటిపెట్టి ''సారీ మాతా, నా ఫ్రెండ్ అడిగితే ఎప్పుడో బీసీ నాటి చలం పుస్తకాలే కదా అని ఇచ్చాను'' అని గారాలు పోయేది. ''ఏమన్నావ్!'' అని కోపంగా చూస్తే ''సారీ అమ్మా! చలంని ఏమీ అననులే'' అని బుద్ధిగా లెంపలు వేసుకుని నవ్వించేసేది.

అసలు చిన్నప్పటినుంచీ అది అంతే. ఎప్పుడైనా గట్టిగా కోప్పడదామన్నా దాని ముద్దులొలికే మొహం చూసి నోరొచ్చేదా? పైగా ఇంత అందమైన, అద్భుతమైన పిల్లని కన్నది తానేనా అని ఆశ్చర్చపోయి అంతలోనే ''తల్లి దిష్టి దెయ్యపు దిష్టే'' అని తన తల్లి మందలించడం గుర్తొచ్చి పశ్చాత్తాపపడేది.




మంచం మీద నడుం వాల్చబోయినదల్లా మంచినీళ్ళు తాగాలన్పించి డైనింగ్ హాల్‌లోకి వెళ్లింది. డైనింగ్ టేబులు కుర్చీల మీద వేళ్లాడుతూ దుప్పటాలు లేవు. సగం తాగిన కూల్‌డ్రింక్ సీసాలూ లేవు. ''అమ్మా, మాతాజీ, మమ్మీ..ఆకలేస్తోంది. భూర్ లగారీ హై, ఐయామ్ హంగ్రీ'' అని మూడు భాషల్లో తొందరపెట్టేస్తూ వడ్డించేలోగానే రుచి చూసేసి చీవాట్లు తినే తన చిన్నారి అలా అల్లరి చేసే చీవాట్లు తినే చిన్నూ ఏదీ?

అప్రయత్నంగానే విజయ గదిలోకి నడిచింది మనోహరి. అదిగో ఇక్కడా అంతే. శుభ్రత అంటే ప్రాణం పెట్టే తనకి, పనిమనిషిపై వదలక ఇంట్లో ప్రతీ అంగుళమూ పరిశుభ్రంగా ఉంచుకుని, విజయనీ, వాళ్ల నాన్ననీ నిత్యం సాధించే తనకి ఇవాళ... ఇప్పుడే 'నీట్‌నెస్' ఇంత చికాకుగా ఉందేమిటి? విజయ మంచం మీద దిండ్లు, టేప్‌రికార్డర్ దగ్గర కేసెట్లూ, ర్యాక్‌లో పుస్తకాలూ ఇలా సర్ది ఉంటే బాగోలేదు. పెద్ద సౌండుతో పాటలూ, దాని గలగలమాటలూ, ఉరుకులూ, పరుగుల హడావిడీ అన్నీ.. ఏవీ లేవు. ఇన్ని మేగజైన్లేమిటి? ఇక చదువెప్పుడు చదువుతావు అని కసిరేతను. ఎప్పుడూ ఫస్టున పాసవుతున్నా అందరిలాగే తనూ చాదస్తంగా అలా అనేది. మరి క్లాసు పుస్తకాలు చదవకపోతే అన్నేసి మార్కులూ, టోఫెల్, జీఆర్ఇ పరీక్షల్లో బ్రహ్మాండమైన స్కోర్లూ, ఇప్పుడు అమెరికాలో యూనివర్శిటీ స్కాలర్‌షిప్పులూ ఎలా వచ్చాయి దానికి? బంగారు తల్లి అది. ఎన్ని వ్యాపకాలున్నా ఎందరు ఫ్రెండ్స్ ఉన్నా అమ్మ తర్వాతే అన్నీ అన్నట్లు ఉండేది కాదూ.. తమ పుట్టినరోజులూ, పెళ్లి రోజు ఎంత జ్ఞాపకం దానికి. అలాంటి విజయ సంతోషం పట్టలేకపోతే 'ఐ లవ్ యూ మమ్మీ' అని బుగ్గ మీద గాఢంగా ముద్దు పెట్టి పరిగెత్తే పిల్ల, 'అబ్బా నేనింటికొచ్చేసరికి నువ్వు ఉండి తీరాలమ్మా లేకపోతే నాకు ఉండబుద్ధికాదు' అని కోప్పడే తన ముద్దులపట్టి ఇప్పుడు అన్ని వేల మైళ్ల దూరంలో ఎలా ఉండగలుగుతుంది? రెండేళ్ళు.. అమ్మో అంటే 24 నెలలు... ఎలా గడపడం? దుఃఖభారంతో కాళ్ళు వణుకుతుంటే అక్కడే విజయ మంచం మీద కూలబడింది మనోహరి. అప్పుడు పడింది ఆమె దృష్టి ఆ చిన్న వస్తువు మీద భరించలేని నిశ్శబ్దంలో, భరించలేని ఆ నీట్‌నెస్‌లో విజయ ఉనికి కోసం ఆర్తితో పరితపిస్తున్న ఆ మాతృహృదయంలో స్తబ్దత ఒక్కసారిగా మాయమైంది. తను ఇద్దరి భుజాల మీద చేతులు వేసి ఆనందంగా నవ్వుతున్న చిన్నారి విజయ్ ఫోటో బిగించిన కీ చైన్ అది. అల్మారాకి వేళ్లాడుతూ అప్పుడు లేచి దాన్ని చేతిలోకి తీసుకుంటూ ఒక్కసారిగా బావురుమంది మనోహరి.

★